# సంశయజీవితం

వి.రాజారామమోహనరావు



అలా చెయ్యటమా, మానటమా అన్న అనుమానంతో వా రిద్దరికీ ఆ రాత్రి సగం పైనే గడిచింది. ఆ భార్యా భర్త లిద్దరూ పడుకున్న చోటికి పక్కనే కిటికీ ఉంది. ఆ కిటికీ పక్కనే రోడ్డు. ఆ ఇల్లు కొంచెం పల్లంలో ఉండటం వల్ల కిటికీ పక్కన నడిచే రోడ్డు మీద జనానికి వా రిద్దరూ పడుకున్న చోటు ఏ మాత్రం శ్రమ లేకుండానే కనిపిస్తుంది. అందులో ఆ ఒక్క గది ఇంటినీ స్పష్టంగా చూపించే లైటు వెలుగు.

లై టార్పితే భయం.. భయం అంటాడు అతని ముసలి తండ్రి. ఆ పెద్దాయనకి ఎడం వేపు శరీరం చచ్చుపడిపోయి ఆర్నెలలు దాటింది. అతను ఆ ముసలి జబ్బు తండ్రికి శక్తికి మించిన వైద్యమే చేయించాడు. అందరి అభిప్రాయం ఇంచుమించు ఒక్కటే... కొద్ది కాలం... ఎనభై ఏళ్ళ ఆ ముసలి శరీరంలోని వైటల్ ఆర్గన్స్ అన్నీ దెబ్బతిన్నాయి. ఎవరు చెయ్యగలిగిం దేం లేదు - ఎదురు చూట్టం తప్ప.

మరీ రోజుల పిల్లల మనస్థితి ఏమిటో, ఎలా ఉంటుందో తెలియనట్టే.. ఆ ముసలాయన బాధ ఏమిటో.. భయమో.. బాధో.. కొంచెం ఎప్పుడేనా కాస్త సుఖ ముందో లేదో ఆ ముసలి తండ్రి ప్రాణానికి అతనికి అర్థమవటం లేదు. ఆ దిశలో ఆలోచన సాగితే చాలు అతనికీ భయం వేస్తోంది.

తండ్రి అంటే గౌరవమే కాదు.. ప్రేమ కూడా ఉంది. అతనికే కాదు.. ఆ ఇంట్లో అందరికీ ఆ ముసలాయ నంటే ప్రేమే. ఆయన అలా అంత సాత్వికంగా బతికాడు.. తన వాళ్ళ నందరినీ అంత చక్కగా ప్రేమించాడు. ఆయన బతికినంత ప్రేమగా హాయిగా... చావు కూడా ఆయన్ని ఇలా ఇబ్బంది పెట్టకుండా ప్రేమిస్తే ఎంత బావుణ్ను. కానీ అలా జరగటం లేదు. కేవలం అస్థిత్వం స్థాయికి దిగజారిన ఆయన స్థితి బాధగా ఉంది. ఆ పరిస్థితి గుటక పడటం లేదు.. ఎవరికీ.

"ఆయన పెద్దాయన... బాధే... కానీ మీరు మరీ ఇలా దిగజారి... ఇంక జీవితం ఏమీ లేనట్టు... ఎవరితోటీ మాటా మంతీ లేకుండా ఎలా... చెప్పండి?" భార్య వెలిబుచ్చిన ఆ బాధ అతనిలో అనేక రకాల భావాల్ని కలిగించింది.

"నిజమే... తండ్రి గురించి తను చెయ్య గలిగినంత చేస్తున్నాడు. మరి ఇలా దిగులు పడిపోయి తన దిగులుతో అందర్నీ క్రుంగదియ్యటం మంచిది కాదేమో! ఆ ఆలోచన తర్వాత... వారం తర్వాత... తల్లి కోసం, ఇంట్లో పిల్లల కోసం, భార్య కోసం తను వేరే ఉండటం అవసరం అనిపించాక... అతను కొంచెం ఉత్సాహం తెచ్చుకున్నాడు.

ఈ మధ్య రెండు రోజులుగా ముసలాయనకి కొంచెం బావుండటంతో అతనికి మరింత పాత జీవితం కనపడింది. ఈ మధ్యన కొన్ని నెలలుగా అలజడి మాటున ఒదిగిపోయిన విషయాలు గుర్తొచ్చాయి. వాటిలోదే ఆర్నెలలుగా తమ భార్యాభర్త లిద్దరూ సంసారం మానేసిన విషయం. ఓ ఒంటరి గదిలో వా రిద్దరి సంసారం అంతకు ముందే అంతంత మాత్రం. అందులో ఈ మధ్య ఏకాంతం లేక, చీకటి దయలేక... మనసులో ప్రాణం లేక... స్తబ్దమైపోయింది.

కొంచెం ధైర్యం చిక్కటంతో మూడు పదుల వయసులో ఉన్న ఆ జంట మనసులో తిరిగి కోరికలు, సరదాలూ చిగురించాయి.

ఏ పరిస్థితిలో నైనా సరే ఆనందంగా ఉండ

గలగటమే... అలా ప్రవర్తించటమే... సరైన జీవితమేమో అన్న సందేహం బలంతో అతను ఓ అడుగు ముందు కేశాడు.

ఆర్నెల్లు గడిచాయి... ఇంకా ఎన్ని నెలలు గడవాలో... అందుకని... ఆ ముసలాయన అస్తిత్వాన్ని నిందించే పరిస్థితి వస్తుందేమో నన్న భయంతో అతని భార్యా కొద్దిగా తల వంచింది.

కానీ... అలా చెయ్యటానికి... ఇద్దరూ జ్ఞానం వచ్చిన, ఇంకా స్కూలుకి వెళ్ళని, పగలంతా నిద్రపోని తమ ఇద్దరి పిల్లల్ని ఆ ముసలాళ్ళ మీద వదిలేసి, ఓ పగలంతా వెళ్ళిపోవాలి. అలా వెళ్ళటం తప్పా? సబబేనా? అన్న అనుమానం. ధైర్యం చేసి ఒక్క పగలు సాహసం చేస్తే... సరైందేనని మనసుని సరిపెట్టగలిగితే... తిరిగి వచ్చి మరింత లైవ్లీగా, నిండుగా... తమ బాధ్యతని, ఆ ముసలాయన్ని ప్రేమ జీవితాన్ని చూసుకోవచ్చేమో అన్న ఆశ... ప్రిటెక్స్ట్ నిండిన ఆశ.

అర్థరాత్రి గడచిన చాలాసేపటివరకు వాళ్ళిద్దరూ అలా అనుమానంగానే ఉన్నారు.

** ** **

దగ్గరి స్నేహితుడి అనుగ్రహం... ఆ పగలంతా వాళ్ళు గడపటానికి ఇల్లిచ్చాడు. ఇల్లు చాలా బాగుంది. ముఖ్యంగా విశాలంగా ఉంది. ప్రత్యేకంగా పడక గది ఉంది.

ఇద్దరూ బెరుకు బెరుగ్గానే ఆ ఇంట్లోకి చేరారు. "పెళ్ళికి వెడుతున్నాం తప్పనిసరై... భోజనం అయి అవగానే వచ్చేస్తాం" అని ఇద్దరూ ఆ ముసలావిడకి చెప్పిన అబద్ధం ఇద్దరిలో లోలోపల నినదిస్తూనే ఉంది. అబద్ధం చెప్పటం, ఆలా ఆ ముసలావిడను మోసం చెయ్యటం. ఛ... అన్న బాధ అతని కన్నా ఆమెని, అత్తగారే అయినా, ఆమెను ఎక్కువగా పట్టుకుంది.

శరీరాన్నంతా నగ్నంగా మార్చుకున్నా ఆ బాధ ఆమెని వదలలేదు.

ఇంటిని, ఆ బాధని చెరిపేసుకోవాలి. కాస్సేపు వేరే లోకంలో బతకాలి అన్న అతని ప్రయత్నం ఎంత బలీయంగా ఉన్నా హృదయం అనాచ్ఛాదితంగా, హాయిగా మారటంలేదు.

కళ్ళని, శరీరాన్ని ఆర్నెల్లుగా తినేసిన రాత్రి, తమ గది లైటు లేదు. రోడ్డు పక్క కిటికీ లేదు. అన్నీ చక్కగా, సౌఖ్యంగా ఉన్నాయి.

ఉన్నాయి... అన్నీ ఉన్నాయి. ఉంది. తృప్తి ఉంది. ఆనందం, తృప్తి తెచ్చుకోవాలి.

కనీసం ఎనిమిది గంటలు అన్నీ మరచిపోయి గడపాలనుకుని ఉదయం ఎనిమిదింటికి ఇంట్లోంచి బయలుదేరిన ఆ పెద్ద జంటకి మధ్యాన్నాని కల్లా అలుపు వచ్చేసింది. రవ్వంత తృప్తీ వచ్చింది.

ఏదో తెలియని ఇరుకు తమని ఆ విశాలమైన గదిలో నొక్కేస్తున్నట్టు ఇబ్బంది పడటం ఆరంభించారు. మగాడిగా అతను పైకి చెప్పలేకపోయాడు. తల్లిగా, స్త్రీగా ఆమె ఆపుకోలేకపోయింది.

అంతే! మరో అరగంట దాటక ముందే ఆమె "వెళ్ళిపోదాం" అంది. ఆ మాట వినగానే అతను వెంటనే "సరే" అన్నాడు బట్టలు వేసుకొంటూ...

** ** **

తిరిగి వడి వడిగా ఇంటి కొస్తున్న ఇద్దరికీ జంకే.

ఏమో ఎంతసేపు కావాలి? ముసలాయన ఏమేనా అయిపోయాడేమో? అలా అయితే ఆ ముసలావిడ పరిస్థితి... పిల్లలు.

ఛ... అవదు... అలా అవదు.

'ఏమో'

వద్దు అలా అనకూడదు...

భయం... దడ. గొంతులో తడారిపోతున్న విచిత్ర స్థితి.

దేముడి దయ వల్ల ముసలాయన బావుంటే ఇంకెప్పుడూ ఇలా చెయ్యకూడదు. ఎన్ని నెలలైనా సరే... సంవత్సరాలైనా సరే!

చెయ్యకూడదు. అసలు అలాంటి భావనే రానీకూడదు.

తప్పు చేశామా?

నిజంగా తప్పు చేశామా?

ఇందాకా రాత్రి తెల్లారే ముందు... ఫరవాలేదు. సబబే అనుకున్నాంగా.

ఏమైనా ఈసారి చెయ్యకూడదు. ముసలాయన పదికాలాలు బతికుంటే అదే చాలు. అదే పదివేలు.

ఆ భయంలోంచి, ఆ జంకులోంచి ప్రేమ... జీవితపు అంత్య దశలోని ఆదరణ... నిండుగా, నిజాయితీగా చెమరుస్తున్నాయి. వాళ్ళిద్దరూ చెమట కక్కుతూ ఇల్లు చేరారు.

ఆత్రతగా నాలుగువేపులా వెతికారు.

"ఏమే అప్పుడే వచ్చేశారు?" అంది ఆ ముసలావిడ ఆశ్చర్యంగా.

తత్తరపాటు తగ్గిన ఆ ఇద్దరికీ ఆ క్షణంలో నవ్వొచ్చింది. ఏడుపూ వచ్చింది-తప్పా ఒప్పా అన్న అనుమానం లాగ.

ముసలాయన బాగానే ఉన్నాడు. ఇరుకైనా... జీవితంలో లాగ.

పిల్లలిద్దరూ ప్రేమగా పరుగెత్తు కొచ్చారు. స్థిమితపడ్డాక చుట్టూ పరికించాక చేసిన పని ఆ ఇద్దరికీ అంత తప్పు అనిపించలేదు.

జీవితం అనిపించింది. *





అతి సౌలభ్యమైన విధంగా సంపూర్ణ టీ రుచిని ఆస్వాదించండి...
ఇండియాలోనే మొట్టమొదటిసారిగా సంచయం చేయబడిన టీ
తక్షణ
ate
'ఇన్స్టీ' ఇదొక ఇన్స్టెంట్ టీ

- ఇండియాలోని శ్రేష్ఠమైన తేయాకులనుండి నూతన పద్ధతినవలంభించి తయారుచేయబడిన అతి శ్రేష్ఠమైన ఇన్స్టెంట్ టీ 'ఇన్స్టీ'.
- నీటిలో సంపూర్ణంగా కరిగే యీ 'ఇన్స్టీ' యొక్క ప్రతి 50 గ్రాములతోనూ 50 కప్పుల టీని తయారుచేసుకోవచ్చు.
- సమపాళంగా పాలు, మరియు అభిరుచికి తగినట్లుగా పంచదార, వేణ్ణీళ్లలో 1/4 టీ స్పూను 'ఇన్స్టీ' కలిపితే చాలు, ఘుమఘుమలాడే చక్కని టీ తృటిలో తయారుకాగలదు.
- 'ఇన్స్టీ' మసాలా, ఏలకుల, చాకొలేట్ 100% స్వచ్ఛమైన మిశ్రణపు రుచులలో కూడా లభ్యం కాగలవు

వ్యాపార విచారణలు ఆహ్వానించబడుతున్నాయి
శ్రీ గణేష్ ట్రేడింగ్ కార్పొరేషన్
99, జి.ఎస్.టి. రోడ్డు, పల్లావరం
మద్రాసు 600 043. ఫోను : 401816